క్లుప్తంగా

నేడు ఇసుక డంపుల వేలం

చిట్యాల : మండలంలోని కాల్వపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేశారు. కాగా సీజ్ చేసిన ఇసుక డంపులకు నేడు (మంగళవారం) తహసీల్దార్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షేక్ ఇమామ్‌బాబా ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు రూ.2వేలు నగదు చెల్లించి రసీదు పొంది వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

పరామర్శ



పలిమెల : మండలంలోని మోదేడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త చిడెం శ్రీను ఇటీవల మృతిచెందాడు. కాగా సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు జక్కు రాకేష్, మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మోదేడు మాజీ సర్పంచ్ చిడెం నాగయ్య, గుమ్మడి శంకర్, ముకునూర్ మాజీ సర్పంచ్ ఆలం సత్యనారాయణ, మట్టి సత్యం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



చిట్యాల : మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి(సీ) గ్రామానికి చెందిన కనకం తిరుపతి అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా అతడి మిత్రులు సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.23వేల ఆర్థికసాయం అందజేశారు. తౌటం రాజు, ఆరెపల్లి రాజ్‌కుమార్, కనుమరుగుల శంకర్, జన్నే నరేష్, ఏకు కిషన్, మైదం మహేష్, చింతల రాజేందర్, కుమ్మరి రాజు, కొర్రి కుమార్, బొచ్చు రాజు, బుర్ర వెంకటేష్, మాస్ కుమార్, పుల్ల శైలేందర్, కొయ్యడ రాజు, పింగిలి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

నూతన ప్రయోగాలపై దృష్టి సారించాలి



ఏటూరునాగారం : డిగ్రీ చదువుతున్న విద్యార్థులు నూతన ప్రయోగాలపై దృష్టి సారించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఈట నవీన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కమిషనరేట్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు ప్రథమ సంవత్సర విద్యార్థులకు సిలబస్, క్రెడిట్ సిస్టం, గ్రేడింగ్ విధానం, నైపుణ్య, సామర్థ్యపరమైన కోర్సుల వంటి అకడమిక్ సంబంధమైన విషయాలను నవీన్ వివరించారు. విద్యార్థులు కోర్సులకు అనుబంధంగా ప్రవేశపెట్టిన వివిధ నైపుణ్య, సామర్థ్యాలను తప్పనిసరిగా నేర్చుకొని డిగ్రీ స్థాయిలో సంపూర్ణ జ్ఞానంతో బయటకు వెళ్లి ఉన్నత విద్యను పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త వెంకటయ్య, ఐక్యూఏసీ కన్వీనర్ జ్యోతి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ కనీస్ ఫాతిమా, సంపత్, రమేష్, జీవవేణి, సుమలత, భావన, భాస్కర్, అభిలాష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మొరం తవ్వకాలు

- చెరువుల్లో మొరం దొంగలు
- స్థానిక అవసరాల పేరుతో అక్రమాలు
- పట్టించుకోని అధికారులు

టేకుమట్ల : గ్రామాల్లో గల చెరువుల్లో మట్టిని పంట పొలాలకు తరలించేందుకు ఇరిగేషన్ అధికారులు అనుమతి ఇచ్చారు. ఇదే అదనుగా భావించిన కొందరు రాత్రి,పగలు తేడా లేకుండా నిరంతరాయంగా ఇష్టారాజ్యాంగా అక్రమంగా చెరువుల్లో మొరం తవ్వకాలను చేపడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. రైతుల పంట పొలాలకు చెరువు మట్టిని వినియోగించుకుంటే మట్టిలోని పోషకాలతో పంట దిగుబడి అధికంగా వస్తుందని ప్రభుత్వం చెరువుల్లో మట్టి తవ్వకాలకు అనుమతులు మంజూరు చేసింది. మండలంలోని పలు గ్రామాల రైతులు తమ పొలాలకు చెరువుల నుంచి మట్టిని తరలిస్తున్నారు.

అనుమతి లేకుండా తవ్వకాలు..

కొన్ని రోజులుగా మండలంలోని కుందనపల్లి, రామకిష్టాపూర్(టి), టేకుమట్ల, రాఘవరెడ్డిపేట, వెల్లంపల్లితో పాటు పలు గ్రామాల చెరువుల్లో ప్రభుత్వ అనుమతుల లేకుండానే పట్టపగలే మొరాన్ని తవ్వుతూ అక్రమంగా తరలిస్తున్నారు. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని మండలవాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా సోమవారం మండలంలోని పంగిడిపల్లి రైతు వేదిక సమీపంలో గల కుంటలో అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్న సమాచారం అందుకున్న ఇరిగేషన్ అధికారులు అక్కడికి చేరుకుని మొరం తవ్వకాలను నిలిపి వేశారు.



పంగిడిపల్లి కుంట వద్ద ట్రాక్టర్‌లో మట్టి నింపుతున్న పొక్లెయినర్

ప్రమాదకరంగా భారీ గుంతలు..

చెరువుల్లో అక్రమ మొరం తవ్వకాలతో భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారుతున్నాయి. వర్షాకాలంలో చెరువుల్లోకి నీరు చేరి భారీ గుంతలు తెలియక రైతులు, పశువులు, మత్స్యకారులు మృత్యువాతపడే అవకాశం ఉంది. గతంలో ఎంతో మంది చెరువుల్లో అక్రమ తవ్వకాల వల్ల ఏర్పడ్డ గుంతల్లో పడి పశువులు మృత్యువాత పడ్డ సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిబంధనలు అతిక్రమిస్తూ, చెరువుల్లో మొరం దొంగలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



స్థానిక అవసరాల పేరుతో చెరువుల్లో ఎలాంటి అనుమతి లేకుండా మొరం తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటాం. మండలంలోని అన్ని చెరువులను పరిశీలిస్తున్నాం. సోమవారం స్థానిక అవసరాల పేరుతో కుంటకి వచ్చిన వాహనాలను తిరిగి పంపించాం. ఇందిరమ్మ ఇళ్లకు మాత్రమే ఇరిగేషన్ ఈఈ అనుమతుల మేరకు అవకాశాన్ని కల్పించాం. అక్రమంగా మొరం తవ్వకాలు ఎక్కడైనా చేపడితే అధికారులకు సమాచారం అందించాలి. అనుమతులు లేకుండా చెరువుల్లో మొరం తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వర్లు ఐబీ ఏఈ

గ్రామీణులకు మెరుగైన రవాణా సౌకర్యం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం మండలంలోని రామన్నగూడెంలో నూతన బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలకు మహాలక్ష్మి పేరిట ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. పరకాల నుంచి ములుగుకు రామన్నగూడెం మీదుగా నడిచే బస్సు సర్వీస్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బస్సును ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే బస్సులో ప్రయాణించారు. ఈ కార్యాక్రమంలో పరకాల ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ రవి, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ నడిపల్లి వెంకటేశ్వరరావు, జిల్లా, మండల నాయకులు సంపత్‌రావు, ఉమేష్‌గౌడ్, పున్నం రవి, భిక్షపతి, నరేష్, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

మహిళలు తరలిరావాలి : ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి రూరల్ : వరంగల్ హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్‌లో రేపు(బుధవారం) తలపెట్టిన మహిళా నాయకత్వ కార్యక్రమ శిబిరానికి నియోజక వర్గం నుంచి అధిక సంఖ్యలో మహిళలు తరలిరావాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పిలుపునిచ్చారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ జిల్లా, మండల, పట్టణ అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఉదయం 8గంటల నుంచి శిబిరం నిర్వహిస్తారని చెప్పారు.

అక్రమాలపై చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తంచేస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

టేకుమట్ల : మండలంలో అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో అక్రమ ఇసుక రవాణా చేస్తున్న అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. పార్టీలో విభేదాలు లేకుండా పని చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని సూచించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, మండల అధ్యక్షుడు సట్ల రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చిట్యాల : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ క్రియాశీలక కార్యకర్త కనకం తిరుపతి అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా సోమవారం తిరుపతి మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి నివాళులర్పించి, పరామర్శించారు. అలాగే మండలంలోని నైన్‌పాక గ్రామానికి చెందిన శ్రీపతి మొండయ్య, కాసర్ల కమలమ్మ, దూత్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వెంకటస్వామి, సుల్తానిబీ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్, ప్రధాన కార్యదర్శి ఏరుకొండ రాజేందర్ గౌడ్, నాయకులు పులి వెంకటేష్ గౌడ్, బైరం భద్రయ్య, తౌటం నవీన్, పాండ్రాల స్వామి, కట్కూరి రాజేందర్, తదితరులు ఉన్నారు.

బీఎల్ఓలు ఇంటింటి సర్వే చేపట్టాలి



సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్, బీఎల్ఓలు

టేకుమట్ల : మండలంలోని అన్ని గ్రామాల్లో బీఎల్ఓలు ఇంటింటి సర్వే చేపట్టాలని తహసీల్దార్ విజయలక్ష్మి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నేషనల్ ట్రెయినింగ్ అండ్ ఓరియంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా బీఎల్ఓలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ త్వరలో జరుగనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో బీఎల్ఓలు అందరు తప్పని సరిగా ఇంటింటి సర్వేలు చేయాలని సూచించారు. ఫారం–6, 7, 8 సరిగ్గా నింపి ఓటరు జాబితాను తప్పులు లేకుండా సరి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెయినర్లు గొనె శ్రీనివాస్, నక్క తిరుపతి, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ లోకల్ కోర్టు

మల్హర్/పలిమెల : పలిమెల మండలంలోని సర్వాయిపేట సబ్ స్టేషన్ ఆవరణలో నేడు (మంగళవారం) విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పాటు చేస్తున్నట్లు కాటారం ఏడీఈ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పడం, ఓల్టేజీ హెచ్చు, తగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపు, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ తదితర సమస్యల పరిష్కారం కోసం వినియోగదారులు రాత పూర్వకంగా ఈ కోర్టులో ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక చైర్మన్ ఎన్వీ వేణుగోపాల చారితో పాటు విద్యుత్ శాఖ అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఫిర్యాదుల స్వీకరణ ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని వెల్లడించారు. మల్హర్ మండల విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు సన్మానం

కాటారం : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ సోమవారం మండల పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబును బీసీ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. బీసీలకు సముచిత స్థానం కల్పించినందుకు మంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు. బీసీలు రాజకీయంగా ఎదగడం కోసం మంత్రి శ్రీధర్‌బాబు ఎనలేని కృషి చేస్తున్నారని కొనియాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా శ్రీధర్‌బాబు శాసనసభలో బీసీలు, మున్నూరు కాపుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రస్తావించారని పేర్కొన్నారు. బీసీలంతా కాంగ్రెస్ పార్టీ, మంత్రి శ్రీధర్‌బాబుకు రుణపడి వెంట ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఐత ప్రకాశ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, టౌన్ అధ్యక్షుడు పసుల మొగిలి, ట్రస్మా అధ్యక్షుడు కొట్టె శ్రీశైలం, బెల్లంకొండ రామన్న, కామిడి వెంకట్‌రెడ్డి, దోమల రాజశేఖర్, సత్యనారాయణ, బొమ్మ సమ్మిరెడ్డి, బీసీ నాయకులు పాల్గొన్నారు.



మంత్రి శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న బీసీ సంఘాల నాయకులు

మంత్రికి వినతి

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో యువతకు క్రీడాస్థలం, వ్యాయామ శాలను ఏర్పాటు చేయాలని మంత్రి డి.శ్రీధర్‌బాబుకు కాళేశ్వరం యువకులు వినతి పత్రం అందజేశారు. సోమవారం మహదేవపూర్‌లో ఆయనకు విన్నవించగా సానుకూలంగా స్పందించారు.

ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌భాస్కర్

మల్హర్ : మండలంలోని తాడిచర్ల ఎస్టీ హాస్టల్‌లో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్ వినయ్‌భాస్కర్ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 36 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అలాగే వల్లెకుంట గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించి, 58 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సుజయ్‌కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం

కాళేశ్వరం : మహదేవపూర్ మండల కేంద్రంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం మండల కమిటీ ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వీరగంటి సమ్మయ్య, ఉపాధ్యక్షుడిగా చిటికేసి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కొమురమ్మ, కార్యదర్శిగా చేకూర్తి రాజబాబు, కోశాధికారిగా చింతకుంట నాగమణి, ప్రచార కార్యదర్శిగా చిటికేసి చంద్రమోహన్‌ను జిల్లా అధ్యక్షుడు వంశీగౌడ్ నియమించారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

‘సీపీఎస్ రద్దుపై పీఆర్‌టీయూ పోరాటం’



చిట్యాల: సభ్యత్వం పొందిన ఉపాధ్యాయులు



రేగొండ: ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

చిట్యాల : ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ సభ్యత్వం ఓ వరమని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం మండలంలోని చల్లగరిగ, జడలపేట, చిట్యాలతో పాటు పలు పాఠశాల్లో ఉపాధ్యాయులు పీఆర్‌టీయూ సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. సీపీఎస్ రద్దుపై రాష్ట్ర ప్రభుత్వంపై పీఆర్‌టీయూ జిల్లా, రాష్ట్ర శాఖలు నిరంతరం పోరాటం చేస్తున్నాయని వివరించారు. మండల ప్రధాన కార్యదర్శి సూదం సాంబమూర్తి, జిల్లా మహిళా అసోసియేట్ అధ్యక్షురాలు ఝాన్సీరాణి, నాయకులు శ్రీనివాస్, సత్యనారాయణ, వాసంతి, శ్రీరామ్, రఘుపతి, రహీంపాషా, నూకల లింగయ్య, పావని, రాజేంద్ర ప్రసాద్, సుజాత, సరళాదేవి, లావణ్య, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

రేగొండ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి చేస్తోందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు దుస్స సదాకర్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయలన్నారు. రాష్ట్రంలో నెలకొన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ పీఆర్‌టీయూ సంఘంలో చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పోతర్ల సతీష్, జిల్లా బాధ్యుడు శివకుమార్, మండల బాధ్యుడు మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బహు జనగణమణ పుస్తకావిష్కరణ

కాటారం : జూలూరి గౌరీశంకర్ రచించిన బహు జనగణమణ పుస్తకాన్ని సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఆవిష్కరించారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదేశాల మేరకు పుస్తకావిష్కరణ చేపట్టినట్లు మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా జోడు శ్రీనివాస్, జక్కు శ్రావణ్ మాట్లాడుతూ.. గౌరీశంకర్ బహుజనగణమణ పుస్తకంలో బహుజనులు పడుతున్న ఇబ్బందులు, వారి బాధలను సుదీర్ఘమైన వివరణలో కళ్లకు కట్టినట్టుగా వివరించారని పేర్కొన్నారు. ఈ పుస్తకంలో రాసిన కవిత్వాలు బహుజనుల్లో నూతన ఉత్తేజం నింపేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఊర వెంకటేశ్వరరావు, పంతకాని సద్విలి, కొండగొర్ల వెంకటస్వామి, వంగల రాజేంద్రాచారి, ఉప్పు సంతోష్, శ్రీలక్ష్మిచౌదరి, బాలరాజు, అశోక్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎస్పీని కలిసిన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్

ములుగు రూరల్ : ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్‌ను మార్కెట్ కమిటీ నూతన చైర్ పర్సన్ రేగ కళ్యాణి మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం ఎస్పీకి మొక్కను అందించారు. అనంతరం కలెక్టర్ దివాకర, డీఎస్పీ రవీందర్‌ను కలిశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సారంగం, డైరెక్టర్లు రసపుల్ సీతారాం నాయక్, బాలయ్య, వెంకన్న, రామస్వామి, పగడయ్య, సమ్మయ్య, వెంకన్న, దేవ్‌సింగ్, రాజ్‌కుమార్, ప్రమీల, గోవిందరావుపేట పీఏసీఎస్ చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి ఉన్నారు.

సీలింగ్ భూములకు పట్టాలివ్వాలి

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి

ఏటూరునాగారం : ములుగు మండలంలోని రాయినిగూడెంలో గల సీలింగ్ భూములకు పట్టాలివ్వాలి రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలోని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రాకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 40ఏళ్ల నుంచి ములుగు మండలం రాయినిగూడెంలోని సర్వేనంబర్ 111, 112లో 30 మంది గిరిజనులు కాస్తు, కబ్జాలో ఉన్నారని వివరించారు. వీరికి గతంలో మూడో విడత భూ పంపిణీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఐదుగురికి పట్టాలిచ్చిందని గుర్తు చేశారు. మిగిలిన 25 మందికి పట్టా రాలేదని తెలిపారు. ఈ భూమిలో అక్రమంగా నాగవెల్లి బాబు కూడా తనకు పట్టా ఉందని దబాయిస్తున్నట్లు తెలిపారు. గతంలో పనిచేసిన ఐటీడీఏ పీఓ అంకిత్ నాగవెల్లి బాబుకు ఈ భూమికి సంబంధం లేదని తీర్పు ఇచ్చారన్నారు. కానీ అతడు ఆ భూమిలోనే సాగు చేస్తున్నాడని తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన భూభారతి పేరుతో గ్రామాల్లో సర్వే నిర్వహించి ఈ భూములపై సర్వే చేసి వెంటనే 25 మంది గిరిజనులకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. అక్రమంగా కాస్తులో ఉన్న నాగవెల్లి బాబును భూమి నుంచి ఖాళీ చేయించాలని పీఓను కోరారు. తవిటి నారాయణ, వట్టం సమ్మయ్య, చెరుకుల రాజన్న, కుర్ర రాజు, ఆగబోయిన పోతయ్య, తవిటి లక్ష్మి పాల్గొన్నారు.



ఐటీడీఏ పీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



వెంకటాపురం(ఎం): బండ్లపహాడ్‌లో నిర్వహించిన వైద్యశిబిరంలో డాక్టర్లు



వాజేడు: రోగులను పరీక్షిస్తున్న వైద్యులు, సిబ్బంది

వెంకటాపురం(ఎం) : పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని వెంకటాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. సోమవారం మండలంలో బండ్లపహాడ్ గొత్తికోయగూడెంలో వైద్యశిబిరాన్ని నిర్వహించి 42 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. అనంతరం ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో, కుండీల్లో నిల్వ ఉన్న నీటిని పారబోశారు. కార్యక్రమంలో డాక్టర్ చందన, ఏఎన్ఎంలు అనురాధ, స్వప్న, శోభ, హెచ్ఏ వెంకట్‌రెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



వెంకటాపురం(ఎం): నీటిని పారబోస్తున్న సిబ్బంది

వాజేడు : వానాకాలంలో వేడిగా ఉన్న ఆహారాన్ని మాత్రమే తినాలని వాజేడు వైద్యాధికారి కొమరం మహేందర్, ప్రగళ్లపల్లి పల్లె దవాఖానా వైద్యాధికారి జ్ఞానస సూచించారు. సోమవారం మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి 42 మందిని పరీక్షించారు. జ్వరం, జలుబు, దగ్గు ఉన్న వారికి మందులు అందించడంతో పాటు గర్భిణులను పరీక్షించారు. ఇంటింటి సర్వే చేయడంతో పాటు నిల్వ ఉన్న నీటిని పారబోశారు. గ్రామంలో మలేరియా ఉన్న రోగి నుంచి రక్త నమూనాలు సేకరించి మందులు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమల లార్వా వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాల్లో ఉన్న నీటిని కాల్వల ద్వారా పంపించాలని సూచించారు. కోటిరెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

హుండీల దొంగ అరెస్ట్

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం, రామన్నగూడెం శివాలయంలో హుండీలు దొంగతనం చేసిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్ సోమవారం తెలిపారు. మండల కేంద్రంలోని సీఐ కార్యాలయంలో దొంగ అరెస్టును చూపి వివరాలు వెల్లడించారు. తాడ్వాయి మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన చేల సందీప్ సాయిబాబా ఆలయంలో హుండీ దొంగతనం చేసి నగదు అపహరించాడు. సీసీ కెమెరాల ద్వారా అతడిని గుర్తించామన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రధాన రహదారిపై వాహన తనిఖీలు నిర్వహిస్తుడగా అటు వైపు నుంచి వస్తున్న వ్యక్తి పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకున్నట్లు సీఐ, ఎస్సై పేర్కొన్నారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా ఏటూరునాగారం, రామన్నగూడెం ఆలయాల్లో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. రూ.1,100ల నగదు స్వాధీనం చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ, ఎస్సై తెలిపారు.